క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించే వారికే మా మద్దతు



ఇందల్వాయి: తమ సమస్యలను పరిష్క రిస్తామని హామీ ఇచ్చిన వారికే మద్దతు తెలుపుతామని దివ్యాంగులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మండల దివ్యాంగుల సంఘం సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన వారికే ఎన్నికల్లో మద్దతు తెలపాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు ఐదు వందల పైచిలుకు ఉంటాయని సంఘ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇంతవరకు ఏ పార్టీ ప్రతినిధులు తమను సంప్రదించకపోవడం దివ్యాంగులను అవమానించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ ప్రతినిధులు నవీన్, మహిపాల్, జమున పాల్గొన్నారు.

బీజేపీలోకి గెంట్యాల వెంకటేష్



సుభాష్‌నగర్: నగరానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గెంట్యాల (బొట్టు) వెంకటేష్, సుమారు 300 మంది కార్యకర్తలు శనివారం బీజేపీలో చేరారు. వారికి అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా పార్టీ కండువాలు కప్పి, బీజేపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పథకాలకు ఆకర్షితులై బీజేపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్‌లో నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ తాను బీజేపీలోకి రావడం సొంతింటికి వచ్చినట్లు ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ గెలుపు కోసం నిరంతరం పని చేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పడిగెల వెంకటేష్, మెట్టు విజయ్, భరత్ భూషణ్, పంచరెడ్డి శ్రీధర్, టెంట్‌హౌజ్ శ్రీనివాస్, మురళీకృష్ణ, కంతెం శ్యామ్, బద్దం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాదిగ సంఘాల మద్దతు

డిచ్‌పల్లి: రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(టీఎమ్మార్పీఎస్) నాయకులు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్, మాదిగ ఉపకులాల మహిళ జిల్లా అధ్యక్షురాలు పులింటి ఒక ప్రకటన విడుదల చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాలు తమ అమూల్యమైన ఓటును బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు వేసి గెలిపిస్తామన్నారు. మాదిగ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్షత్రీయ పాఠశాలలో 'అరణ్య'

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాలలో పూర్వప్రాథమిక విద్యార్థుల క్షత్రీయ అరణ్య అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్షత్రీయ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రకృతి సంపదకు, ప్రకృతి అందానికి భారత దేశం నిలయమన్నారు. అటువంటి ప్రకృతి వనాన్ని బయట ప్రపంచంలోకి వెళ్ళి చూడలేక పోతున్న పూర్వ ప్రాథమిక విద్యార్థుల కోసం అరణ్య కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. విద్యార్థుల అడవి జంతువుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాధారణ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే సాధారణ పరిశీలకులు గౌతంసింగ్ (94250-63524)కు ఫిర్యాదు చేయవచ్చని రూరల్ రిటర్నింగ్ అధికారి రాజేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ భంగపర్చినా.. అక్రమంగా డబ్బుల పంపిణీ, మద్యపానం, గృహావసరాల వస్తువులు, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు దృష్టికి వస్తే ఫోన్ నెంబర్ ద్వారా తెలపాలని కోరారు. అలాగే నగరంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

మరోసారి దీవిస్తే మరింత అభివృద్ధి

- అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా
- నగరంలో ఎన్నికల ప్రచారం



వృద్ధురాలితో మాట్లాడుతున్న గణేశ్‌గుప్తా



నగరంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ నాయకులు

నిజామాబాద్‌నాగారం: అర్బన్ ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదిస్తే నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. నగరంలోని 8, 27, 41, 42 డివిజన్లలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.... నగరంలో 60ఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం 9ఏళ్లలో చేసి చూపించామన్నారు. గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించామన్నారు. రైతుబీమా తరహాలో రూ.93లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా, రూ. 400లకే వంట గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్లు రూ.5000, దివ్యాంగులకు రూ.6000, అన్నపూర్ణ పథకం ద్వారా అందరికీ సన్న బియ్యం అందిస్తామన్నారు. మేయర్ నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, మాజీ కార్పొరేటర్ చాంగుబాయి, పట్నం విక్రమ్‌గౌడ్, శ్రీను, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి, షేక్ అహ్మద్, పూర్ణ, జ్ఞానేశ్వర్, జింక అశోక్, మహబూబ్, ఎర్రం గంగధర్, అంతరెడ్డి దేవి, కొండపాక రాజేష్, గోపరి లక్ష్మణ్, హరిబాబు, చింతకాయల రాజు, వెల్డింగ్ నారాయణ, అంబాదాస్, శ్రీను, పల్లికొండ అన్నయ్య, సీతారాం, మధుసుధన్, గంగాధర్, గరిపల్లి ప్రవీణ్, పవన్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి





పదకల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి.. సికింద్రాపూర్‌లో..

రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పుప్పాలపల్లి, గన్యతండా, మాదాపూర్, బాలానగర్, కేశ్‌పల్లి, పడకల్, కలిగోట్, చింతలూర్ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు అప్పాల రాజన్న, అనంత్‌రెడ్డి, చిన్నారెడ్డి, నర్సారెడ్డి, నాయకులు వసంత్‌రావు, వినోద్, శ్రీధర్, చిన్నారెడ్డి, మనోజ్, గణేష్,సాయికుమార్, యంజీ గంగారెడ్డి, మునిపల్లి సర్పంచ్ సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



నగరంలో మాట్లాడుతున్న ప్రేమ్‌లాల్



సిరికొండలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని తెరవే (తెలంగాణ రచయితల వేదిక) కార్యాలయంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెరవే జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ మాట్లాడుతూ.. విద్యార్థులను భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దే ప్రయోగశాలలే పాఠశాలలు అని పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వయోజన విద్యకు నిరంతరం కృషి చేశారన్నారు. విద్య, సంస్కృతిని కాపాడడానికి సంగీత అకాడమీలు స్థాపించారన్నారు. సంఘ సభ్యులు అనిత, శోభ, ప్రసన్నకుమారి ఉన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని కిడ్స్‌పార్క్ పాఠశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటింటికి బీఆర్‌ఎస్ ప్రచారం





ధర్పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు.. డిచ్‌పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు నాయకులు వివరించారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. నాయకులు హనుమంతు రెడ్డి, రాజ్ పాల్ రెడ్డి, రాములు , మమ్మద్ నజీర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ కిష్టారెడ్డి రాధా, మహిళ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరఫున ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

ఎంసీఎంసీ కేంద్రం పరిశీలన

సుభాష్‌నగర్ : రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు చిన్నయ్ పాటిల్ ప్రభాకర్, తాన్యాసింగ్ శనివారం పరిశీలించారు. అధికారుల పనితీరును జీపీఆర్‌ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ల వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఎంసీఎంసీ కమిటీ సభ్య కార్యదర్శి ఎస్ పద్మశ్రీ, నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.



మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ముస్లింల రిజర్వేషన్‌పై మాటతప్పిన కేసీఆర్



ఖలీల్‌వాడి: ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి సీఎం కేసీఆర్ మాట తప్పారని నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని ఆటోనగర్‌లోగల కేకే గార్డెన్‌లో శనివారం ఆయన 12, 13 డివిజన్ మహిళలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనారిటీల హక్కుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్ ప్రభుత్వానికి లేదన్నారు. మైనారిటీ బంధులో 30 శాతం కమిషన్ తీసుకున్నట్లు చెప్పారు. కేటీఆర్ మైనార్టీ డిక్లరేషన్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. నాయకులు కేశవేణు, తాహెర్‌బిన్ హందన్, జావిద్ అక్రం, నజీబ్ అలీ, అర్షద్ ఖాన్, ముజాహిద్ ఖాన్, నయీమ్ షెహరాన్ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీకి విద్యార్థి సంఘాల మద్దతు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీకి విద్యార్థి సంఘాల నేతలు మద్దతు తెలిపారు. నగరంలోని మారుతీనగర్‌లో శనివారం టీవీయూవీ, ఏఐఎస్‌ఎఫ్, టీజీవీపీ, టీఎఫ్‌ఎస్ విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. తనకు మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. నాయకులు లాల్‌సింగ్, రఘురాం,అనిల్, భానుచందర్, జైతురాం ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఖలీల్‌వాడి: నగరంలోని 37వ డివిజన్ బీజేపీ నాయకురాలు శోభారాణి, పలువురు మహిళలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. నాయకులు కేశవేణు, భాస్కర్, జావిద్ అక్రమ్, గడుగు రోహిత్, నజీర్, పంచరెడ్డి చరణ్, వరుణ్ కిర్లోస్కర్. దత్తాత్రేయ ఉన్నారు.

దీపావళి వేడుకలు

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న తపస్వీ తేజో నిలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం దీపావళి వేడుకలను నిర్వహించారు. క్లబ్ సభ్యులు తపస్వీ తేజో నిలయం విద్యార్థులకు మిఠాయిలు, పటాకులు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారి గోపి, కార్యదర్శి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు పుష్పాకర్‌రావు, చౌటి లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ కోసమే పార్టీ మార్పు



వర్ని: మండలంలోని సైదిపూర్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ వద్ద 10 లక్షల ప్యాకేజీ తీసుకొని పార్టీ మారారని బీఆర్‌ఎస్ మండల నాయకులు, గిరిజన నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిరితోపాటు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్ వద్ద రూ.10లక్షల ప్యాకేజీ తీసుకొని పార్టీ మారిన మాజీ సర్పంచ్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఒక వ్యక్తి పార్టీ మారినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదని, సదరు వ్యక్తి గ్రామానికి చెందిన గిరిజన నాయకులందరూ బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, సైదిపూర్ సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ రూప్ల, నాయకులు వీర్రాజు, సరిచంద్, రమేశ్‌నాయక్, గోపి, పీర్యా పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా తెలంగాణ

- నిజామాబాద్ రూరల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



చిన్నవాల్గోట్‌లో బాజిరెడ్డికి బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సిరికొండ: బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా మారిందని రూరల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో మండలాన్ని ఎంతగానో అభివృద్ధి చేశానని, మరో మారు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. మండలంలోని సర్పల్లితండా, పెద్దవాల్గోట్, పోత్నూర్, చిన్నవాల్గోట్, నర్సింగ్‌పల్లి, న్యావనంది, రావుట్ల, కుర్దుల్‌పేట్, మైలారం గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ గ్రామాల్లో మహిళలు బోనాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. బాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ సంగీతరాజేందర్, జెడ్పీటీసీ మాన్‌సింగ్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సిరికొండ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

ధర్పల్లి: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహిళలు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రమేష్, సంతోష్,మురళి, నందు ఉన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు ప్రయోజనం





మోపాల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. గోప్యతండాలో..

మోపాల్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి తరఫున ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. గంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, రూరల్‌లో భూపతిరెడ్డికి భారీ మెజార్టీ వస్తుందని తెలిపారు. నాయకులు ఎల్లోల సాయిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, కృష్ణ ఉన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని గోప్యతండాలో శనివారం రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డికి మద్దతుగా పార్టీ సెల్ జిల్లా నాయకులు సంతోష్ నాయక్ ప్రచారం నిర్వహించారు. పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు జయరాంజాదవ్, మాజీ ఎంపీటీసీ రాంసింగ్, సంతోష్‌నాయక్, జీవన్, బలరాం, గజన్‌నాయక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాస్తారోకో



వేల్పూర్: జిల్లాలో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీలకు టికెట్లు కేటాయించలేదని బీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయపార్టీల తీరును నిరసిస్తూ శనివారం వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై బీసీలు రాస్తారోకో చేశారు. రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రాకముందే బీసీలు ఆందోళనను విరమించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,700	వెండి (కిలో)	75,000
22 క్యారెట్స్	56,887		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	15	30	గాజరుగడ్డ	40	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	35	50	దోసకాయ	15	30
దొండకాయ	15	30	ఆలుగడ్డ	18	30
బిర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	50
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	40	60	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	జపాన్(తెలుగు)- 10.20 7.30 జిగర్ తండ డబుల్ఎక్స్- 1.20, 10.30
	టైగర్-3(తెలుగు)-4.35
స్క్రీన్-2	మా ఊరి పొలిమేర-2 - 10.40,7.30
	జపాన్(తెలుగు)-1.15 ది మార్వెల్స్(ఇంగ్లీష్-3)-4.40,10.30
స్క్రీన్-3	టైగర్-3(హిందీ)-10.30 1.30 4.30 7.30 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ద మార్వెల్స్(తెలుగు)-10.10 ద మార్వెల్స్(ఇంగ్లీష్)- 10.50 జపాన్(తెలుగు)-12.45 7.30 టైగర్-3(హిందీ)-4.05
స్క్రీన్-2	టైగర్-3(హిందీ)-10.00,1.25,7.25, 10.50 - ది మార్వెల్స్(ఇంగ్లీష్)-4.50
స్క్రీన్-3	టైగర్-3(తెలుగు)-10.15 జిగర్‌తండ(తెలుగు)-1.40 దీపావళి(తెలుగు)-3.15 కోటా కోలా(తెలుగు)-6.00
స్క్రీన్-4	మా ఊరి పొలిమేర(తెలుగు)-10.35, 1.25,7.40,10.30 టైగర్-3(తెలుగు)-4.15 10.30
దేవి	జపాన్(తెలుగు)
నటరాజ్	టైగర్-3(హిందీ)
లలితామహల్	భగవంత్ కేసరి(తెలుగు)
విజయ్	జిగర్ తండ(తెలుగు)